: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్


సంపుటి : 4 | సంచిక : 17 | 22-01-2024 | పుటలు : 4



## ఏపీ గవర్నర్‌ను కలిసిన వీసీ ఆచార్య కె.పద్మరాజు

**21.01.24 (మీడియాసెల్)**

ఆదివారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్ కార్యాలయంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈనెల 31న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న 13,14 మరియు 15వ స్నాతకోత్సవ ఆహ్వాన పత్రికను గవర్నర్ కు అందజేశారు. తప్పనిసరిగా స్నాతకోత్సవానికి హాజరుకావాలని, విద్యార్థులకు పట్టాలు అందజేయాలని కోరారు.




# 31న నన్నయ యూనివర్సిటీ స్నాతకోత్సవం

## గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పట్టాల ప్రదానం

## పద్మభూషణ్ సుధామూర్తికి గౌరవ డాక్టరేట్



తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, మన్యం(సగభాగం) జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పరిధిలో 390 అనుబంధ కళాశాలలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అతిపెద్ద విశ్వవిద్యాలయంగా పేరొందింది.

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13,14 మరియు 15వ స్నాతకోత్సవ వేడుకలు ఈ నెల 31వ తేదీన నిర్వహిస్తున్నారు.యూనివర్సిటీ ఎన్.టి.ఆర్. కన్వెన్షన్ సెంటర్ లో 31వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు స్నాతకోత్సవం ప్రారంభమవుతుంది.

నన్నయ విశ్వవిద్యాలయంలో 2019-20, 2020-21, 2021-22 విద్యాసంవత్సరానికి చెందిన పిహెచ్.డీ, పీజీ, పీజీ డిప్లొమా, యూజీ అండ్ పీజీ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన వారికి పట్టాలు అందిస్తారు. ఈ 13,14,15వ స్నాతకోత్సవానికి వివిధ కోర్సులకు చెందిన 500 మంది విద్యార్థులు అప్లై చేసుకున్నారు.

వీరిలో Ph.D - (మేనేజ్‌మెంట్ స్టడీస్-4, కంప్యూటర్ సైన్స్ & ఇంజినీరింగ్-2, మ్యాథమెటిక్స్-1, ఫిజిక్స్-1, కెమిస్ట్రీ-1, జియో సైన్సెస్-3)

గోల్డ్ మెడల్స్ - (ఇంగ్లీష్ -3, జియాలజీ - 3, బయో-టెక్నాలజీ - 2, మైక్రో-బయోలజీ - 1, అప్లైడ్ మ్యాథమెటిక్స్-3

ప్రైజ్ - (తెలుగు -1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-1, సోషల్ వర్క్-1, ఇంగ్లీష్ 3, ఎకనామిక్స్-3, ఫిజిక్స్ -3)

500 మందిలో పిహెచ్.డి 12, గోల్డ్ మెడల్స్ 12, ప్రైజ్ 12, మిగిలిన వారు పీజీ కోర్సులు ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, ఎల్.ఎల్.ఎం, ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంఈడీ, ఎల్.ఎల్.బి., బీఈడీ వంటి కోర్సులు పూర్తి చేసిన వారు ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పట్టాల ప్రదానం జరుగుతుంది.

మూడు విద్యా సంవత్సరాలలో విశ్వవిద్యాలయం మరియు అనుబంధ కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 8582, అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 50173 మంది విద్యార్థుల పట్టాలు ఆమోదిస్తారు.

ముఖ్యఅతిథి పద్మభూషణ్ సుధామూర్తికి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తారు.

**శ్రీమతి పద్మభూషణ్, పద్మశ్రీ సుధామూర్తి**

పద్మభూషణ్, పద్మశ్రీ సుధామూర్తి భారతీయ సంఘ సేవకురాలు, రచయిత్రి. కంప్యూటర్ ఇంజనీర్‌గా జీవితాన్ని ప్రారంభించి ఇన్ఫోసిస్ ఫౌండేషన్, గేట్స్ ఫౌండేషన్ ప్రజారోగ్య విభాగాలలో కీలకపాత్రలను పోషిస్తున్నారు. ఈమె









పలు అనాధాశ్రమాలను ప్రారంభించారు. అలాగే గ్రామీణాభివృద్ధికి సహకరించారు. కర్ణాటకలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు అందించి తద్వారా పేద విద్యార్థులు కూడా ఉచితంగా కంప్యూటర్ జ్ఞానాన్ని పొందగలిగేందుకు తోడ్పడ్డారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో భారతీయ గ్రంథాలతో ది మూర్తి క్లాసికల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా ప్రారంబించారు. తన వృత్తి జీవితంతో బాటు ఈవిడ ఒక మంచి కంప్యూటర్ సైన్స్ ఉపాధ్యాయురాలు, కాల్పనిక రచనలు కూడా చేస్తుంది. ఈమె రచించిన కన్నడ నవల డాలర్ సొసే (డాలర్ కోడలు) ఆంగ్లములో డాలర్ బహుగా అనువదించబడింది. తర్వాత ఇదే నవల 2001లో జీ టీవీలో ధారావాహికగా ప్రసారమైనది.

2006లో భారత ప్రభుత్వము నుండి అత్యుత్తమ పద్మశ్రీ పురస్కారము , సామాజిక సేవ, దాతృత్వం , విద్యా రంగాలలో ఆమె సేవలకు గౌరవ డాక్టరేటు లభించాయి.

ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధినేతగా పలు సేవలు అందిస్తున్నారు. 2023 -పద్మ భూషణ్ అవార్డు, 2023 - గ్లోబల్ ఇండియన్ అవార్డు. దీనిని కెనడా ఇండియా ఫౌండేషన్ (CIF) వారు ప్రదానం చేసారు. ఆమె భర్త నారాయణ మూర్తికి ఇదే పురస్కారం 2014 లో లభించింది. వారు ఈ అవార్డు తీసుకున్న మొదటి జంట. దీని విలువ $50,000. ఆమె ఈ మొత్తాన్ని ది ఫీల్డ్ ఇన్స్టిట్యూట్ (టొరంటో విశ్వవిద్యాలయం)కు విరాళంగా ఇచ్చారు.

**పద్మభూషణ్, పద్మశ్రీ సుధామూర్తి అల్లుడు ప్రస్తుత బ్రిటన్ ప్రధాని రిషి సునక్.**

**స్నాతకోత్సవం విజయవంతం చేయండి**

13,14 మరియు 15వ స్నాతకోత్సవ వేడుకలకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నాం. విశ్వవిద్యాలయ ఛాన్సలర్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పట్టాల ప్రదానం జరుగుతుంది. ముఖ్యఅతిథిగా ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు పద్మభూషణ్ సుధామూర్తి హాజరవుతున్నారు. ఆమెకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్నాం. ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్‌తో నన్నయ విశ్వవిద్యాలయానికి ఎం.వో.యు ఉంది భవిష్యత్‌లో విశ్వవిద్యాలయ అభివృద్ధిలో మరింత భాగస్వామ్యం అవుతారు. అతిథులుగా మంత్రి బొత్స సత్యనారాయణ, యాప్సి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్యామలరావు మరియు ఉన్నతాధికారులు, విశ్వవిద్యాలయ ప్రముఖులు హాజరవుతారు. స్నాతకోత్సవానికి సంబంధించి విశ్వవిద్యాలయంలోని అధికారులు, అధ్యాపకులచే ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి ఏర్పాట్లు వేగవంతంగా చేస్తున్నాం. విశ్వవిద్యాలయంలో విద్యాపరమైన అతిపెద్ద పండుగ స్నాతకోత్సవం కాబట్టి దీనిని అందరూ కలిసి విజయవంతం చేయాలని ఆకాంక్షిస్తున్నాను.

**ఆచార్య కె.పద్మరాజు**
**ఉపకులపతి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం**

# సంపాదకీయం



## ధరిత్రి

*ప్రకృతిః పంచభూతాని గ్రహా లోకాః స్వరాస్తథా!*
*దిశః కాలశ్చ సర్వేషాం సదా కుర్వంతు మంగలం!!*

ప్రకృతిలోని పంచభూతాలు, అంతరిక్షం,గ్రహాలు ఈ విశ్వమంతటికి శుభం జరగాలని మన పూర్వీకులు నిత్య ప్రార్ధనలు చేసేవారు."సర్వేజనాః సుఖినోభవంతు" అని విశ్వః శ్రేయాన్ని కోరారు.

శాస్త్ర సాంకేతిక యుగంలో వస్తున్న మార్పులే గొప్పవనుకుని ప్రకృతిని అశ్రద్ధ చేయవద్దని మహనీయులు ఘోషిస్తున్నారు. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్ధాలను ప్రజాజీవనం మీదకి వదలొద్దని పచ్చని పంట పొలాలను ఉప్పునీటి క్రయ్యలుగా మలచవద్దని పర్యావరణవేత్తలుమొత్తుకుంటున్నారు. ఎవరి ఇంటినివారు కల్మషరహితంగా ఉంచుకోవాలని ప్రబోధిస్తున్నారు. మన పూర్వీకులు ఈ భూమిని తల్లిగా భావించారు. నా పాదాలను నీ మీద మోపుతున్నాను, ఓభూదేవి! నన్ను క్షమించు తల్లీ!అని నమస్కరించి పవిత్ర భావంతో మట్టిని స్పృశించారు.

నిన్నుగూర్చి పాడుకుందు,నన్ను గూర్చి పాడుకొందు, నిన్ను నన్ను కన్నతల్లి నేలగూర్చి పాడుకొందునన్నారు సినారె. నేలమ్మ నేలమ్మ నేలమ్మ నీకు వేల వేల వందనాలమ్మ! అని పరవశించుకుంటూ పాడారు సుద్దాల అశోక్ తేజ. ప్రకృతిలో పరవశించిన కవులు ప్రకృతికి హాని జరిగితే తట్టుకోలేరు.

పరమాద్భుత తత్వాల్ని తనలో నిబిడీకృతం చేసుకున్న పుడమి మానవునికి ఆవాసమై జీవికనిచ్చింది. అందుకే ఈ భూమి మీద ఉన్న నదులు,సముద్రాలు, మహాసాగరాలు, ఆకాశమార్గాలు, పర్వతాలు దేశాలను వేరుచేస్తున్న సరిహద్దులుకావు. సమైక్యం చేయగల మైత్రీ బంధాలు. అవి విశ్వజనీయమైన మానవ జీవితానికి ఆదర్శ భావనలు. ఆ దృష్టితోనే మన పూర్వులు సకల ప్రకృతినీ,ప్రపంచాన్ని ఒకే కుటుంబంగా,అఖండంగా, పవిత్రంగా, పరమాత్మ తత్వంగా దర్శించారు.

మనిషికి ప్రకృతి అనేక వరాలను ప్రసాదించింది. ప్రకృతితో సహజీవనం చేస్తున్నప్పుడు నాగరకత కలకాలం వర్ధిల్లుతుంది. కానీ నాగరకత అభివృద్ధి ముసుగులో సహజ వనరుల దుర్వినియోగం పెరిగిపోతే మానవ మనుగడకే ముప్పుతప్పదు. భూమి, నీరు, గాలి, ఆకాశం వీటితో కూడిన ప్రకృతి ఏదైతే ఉందో అది భౌతిక పర్యావరణం. ఆ పర్యావరణం మరణం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత పూర్తిగా మనిషిదే.

భౌతిక పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని, పర్యావరణాన్ని నిష్కల్మషంగా ఉంచుకుంటూ జీవించాలనే విషయాన్ని ఎవరికివారు అవగాహన చేసుకోవలసిన సమయమిది.

# వీసీ పద్మరాజుకు శుభాకాంక్షలు

**ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె పద్మరాజును వివిధ సంస్థల ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.**



జి.వి. మనోజ్ కుమార్, డైరెక్టర్ డిపార్ట్మెంట్ అఫ్ టెలీకామ్యూనికేషన్స్



అయోధ్య రామ మందిర అక్షింతలు అందిస్తున్న రామారావు, సనత్ కుమార్, పాండురంగరావు



పూర్వ ఈసీ మెంబర్ డా.జె. సునీత ప్రిన్సిపాల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల-కొవ్వూరు, ఈసీ మెంబర్ డా.కె. జ్యోతి ప్రిన్సిపాల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల-నిడదవోలు



పి.వి.వి. కృష్ణ ప్రదీప్ - చైర్మన్, ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ



శ్రీధర్ వర్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్- ఏపీ.ఈ.పి.డి.సి.ఎల్

### ట్వంటీ ఫస్ట్ సెంచరీ సంస్థతో

# నన్నయ ఎంవోయు

## గ్రూప్-II పోటీ పరీక్షలకు శిక్షణ



21స్ట్ సెంచరీ సంస్థతో నన్నయ వర్సిటీ ఎంవోయు కుదుర్చుకుంటున్న దృశ్యం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థులకు గ్రూప్-II పోటీ పరీక్షలకు శిక్షణ అందించేందుకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరియు 21స్ట్ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ మధ్య అవగాహన ఒప్పందం పునరుద్ధరించామని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. శుక్రవారం యూనివర్సిటీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఎంవోయూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు అధ్యక్షతన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, 21స్ట్ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పి.వి.వి. కృష్ణ ప్రదీప్ ఎంవోయు పత్రాలపై సంతకాలు చేసి పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు, పూర్వ విద్యార్థులకు గ్రూప్-II పోటీ పరీక్షలకు సంబంధించి శిక్షణ అందించేందుకు 21స్ట్ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ వారు ముందుకు వచ్చారని చెప్పారు. సంస్థ ప్రారంభించినప్పటి నుండి ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్., ఐ.ఆర్.ఎస్ మరియు కేంద్ర సేవలతో సహా 200 మంది విద్యార్థులకు పైగా సివిల్ సర్వీసెస్ లో ప్రవేశించడానికి సహాయం చేసిందన్నారు. 21స్ట్ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ విద్యార్థులకు గ్రూప్-II పోటీ పరీక్షలకు నాణ్యమైన శిక్షణ అందుతుందన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.టి.హైమావతి ని సంప్రదించాలని తెలిపారు. విద్యార్థులను ఎంపిక చేసి శిక్షణ తరగతులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.టి.హైమావతి, 21స్ట్ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ సి.ఈ.ఓ కె.ధరణి, సీనియర్ సివిల్స్ మెంటార్ బి.అభినవ్ శ్రీకాంత్ మరియు విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.


## విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభించిన వీసీ





ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఏ.పి.ఈ.పి.డి.సి.ఎల్ 9వ ఇంటర్ డివిజన్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ను వీసీ ఆచార్య కె.పద్మరాజు ప్రారంభించారు. శనివారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాగణంలో ఏ.పి.ఈ.పి.డి.సి.ఎల్ 9వ ఇంటర్ డివిజన్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ ఎంతో ఒత్తిడితో నిరంతరం పని చేసే విద్యుత్ శాఖ ఉద్యోగులకు ఇటువంటి క్రీడాపోటీలు నిర్వహించడం హర్షనీయమని అన్నారు. ఒత్తిడి నుండి ఉపశమనం పొందడానికి మానసిక స్థితిని మెరుగుపరచుకోవడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. నిత్యం సమాజానికి సేవలు అందించే విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలకు నన్నయ విశ్వవిద్యాలయం వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. క్రీడా పోటీలను ప్రారంభించి వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన విద్యుత్ ఉద్యోగ క్రీడాకారులకు శుభాకాంకలను తెలియజేసారు. ఏ.పి.ఈ.పి.డి.సి.ఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ టి.వి.ఎస్.ఎన్,మూర్తి మాట్లాడుతూ 9వ ఇంటర్ డివిజన్ క్రీడా పోటీలు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం, రామచంద్రపురం, జగ్గంపేట, కాకినాడ, రంపచోడవరం, అమలాపురం మరియు సర్కిల్ ఆఫీస్ లు టీమ్స్ గా పోటీలు జరుగుతాయన్నారు. విద్యుత్ ఉద్యోగులు ముఖ్యంగా వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, క్యారంబోర్డ్, చెస్ వంటి పోటీలలో చురుగ్గా పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ కనపరచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, గతంలో సర్కిల్‌కు ప్రథమ స్థానాలు దక్కాయన్నారు. ఉద్యోగులకు ఇటువంటి పోటీలు నిర్వహించడం ద్వారా శారీరక మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందన్నారు. క్రీడాకారులకు శుభాకాంకలను తెలియజేసి, చక్కని ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి వీసీ పద్మరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఈఈ నక్కపల్లి శామ్యూల్, రూరల్ ఈఈ దాట్ల శ్రీధరవర్మ, ఎస్.ఎ.ఓ. కె.ఆదినారాయణ మూర్తి, విద్యుత్ అధికారులు, విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యానికి పునాది - ఓటు హక్కు





ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఎన్నికలు సక్రమంగా నిర్వహించడానికి 1950 జనవరి 25న 'ఎన్నికల సంఘం' ఏర్పడింది.ఎన్నికల సంఘం ఏర్పడి 60 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఎన్నికల సంఘం సేవలకు గుర్తింపుగా 2011 జనవరి 25 నుండి భారత ప్రభుత్వం "జాతీయ ఓటర్ల దినోత్సవం" ను నిర్వహిస్తుంది.దీని ముఖ్య ఉద్దేశం ఓటు హక్కుపై, ప్రజాస్వామ్య వ్యవస్థపై విద్యార్థులకు,ప్రజలకు ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించడానికి రకరకాల కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఈ ఓటు హక్కు అనేది రాజ్యాంగం మనకు ప్రసాదించిన అతిపెద్ద వరం. మనకు నచ్చిన,మన దేశానికి కావలసిన నాయకులను ఎన్నుకోవడానికి ఈ ఓటు హక్కు ఉపయోగ పడుతుంది.

అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ అన్నట్టుగా ప్రజల చేత,ప్రజల కొరకు, ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వమే ప్రజాస్వామ్యం. ఈ ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ద్వారా మన దేశానికి తగిన ప్రజాప్రతినిధు లను మనమే ఎన్నుకుంటాము. ప్రజాస్వామ్య మనుగడకు పునాది మన ఓటే. రాజ్యాంగంలోని 326 అధికరణ ప్రకారం 18 సం. నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించబడుతుంది. కుల,మత,జాతి,లింగ బేధం లేకుండా అక్షరాస్యులైనా, నిరక్షరాస్యులైన కూడా 18 సం.నిండిన ప్రతి ఒక్కరికి ఈ సార్వత్రిక వయోజన ఓటు హక్కు కల్పించబడుతుంది. ఈ ఓటు హక్కు అనేది ప్రపంచ రాజకీయ చరిత్రలోనే ఒక విప్లవాత్మకమైన మార్పుగా చెప్పవచ్చు.

ఎన్నికలలో పోటీ చేయాలన్నా,ఓటు వేయాలన్న ఓటర్ గా నమోదు చేసుకోవడం తప్పనిసరి.1852లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికలలో 45% మాత్రమే ఓటింగ్ జరిగింది.2019లో జరిగిన 17వ లోక్ సభ ఎన్నికలలో 67% ఓటింగ్ నమోదయింది. మొత్తం ఓటర్లలో 90% ఓటింగ్ నమోదైతేనే ఆ దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని మన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పడం జరిగింది.యువత దేశ భవిష్యత్తుకు మూలం.దేశ రాజకీయాలలో యువత పాత్ర చాలా కీలకం.మన ఓటు హక్కు ద్వారా ఎటువంటి వివక్ష చూపని రాజకీయ నాయకులను ఎన్నుకొని దేశ అభివృద్ధికి పాటుపడాలి. అందుకు అందరికీ ఓటు హక్కు తప్పనిసరి.

-బి.సుశాంత్ కుమార్

## మంచిమాట



# పూర్ణ వందేమాతరం





వందేమాతరం
వందేమాతరం

సుజలాం సుఫలాం మలయజ శీతలామ్
సస్యశ్యామలాం మాతరం వందేమాతరం

శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీమ్
ఫుల్ల కుసుమిత ద్రుమదళ శోభినీమ్
సుహాసినీం సుమధుర భాషిణీమ్
సుఖదాం వరదాం మాతరం వందేమాతరం

కోటి కోటి కంఠ కలకల నినాద కరాలే
కోటి కోటి భుజై ధృత ఖర కరవాలే
అబలాకేనో మా ఎతో బలే
బహుబల ధారిణీం నమామి తారిణీం
రిపుదల వారిణీం మాతరం వందేమాతరం

తుమి విద్యా తుమి ధర్మ
తుమి హృది తుమి మర్మ
త్వంహి ప్రాణా: శరీరే
బాహుతే తుమి మా శక్తి
హృదయే తుమి మా భక్తి
తోమారయి ప్రతిమాగడి మందిరే మందిరే వందేమాతరం

త్వంహి దుర్గా దశ ప్రహరణధారిణీ
కమలా కమలదళ విహారిణీ
వాణీ విద్యాదాయినీ, నమామిత్వాం, నమామి కమలాం
అమలాం, అతులాం, సుజలాం, సుఫలాం,మాతరం వందేమాతరం

శ్యామలాం, సరలాం, సుస్మితాం, భూషితాం
ధరణీం, భరణీం, మాతరం వందేమాతరం
వందేమాతరం

**భావం:**
జననీ నీకు వందనం! పుణ్యప్రదమైన గంగ, యమునాది జీవనదులను కలిగినదానవు. మధుర ఫల భరితవు. మలయ పర్వతముల నుండి చల్లదనాన్ని పొంది సేదతీర్చే వాత్సల్య పూర్ణవు అయిన తల్లీ! నీకు నమస్కరిస్తున్నాను.

స్వచ్ఛమైన తెలి వెన్నెల చేత పరవశించిన రాత్రులు గలిగి వికసించిన పారిజాత సుమాలతో శోభించే నిత్యమంగళ రూపానివి, దరహాస చంద్రికలతో మాపై ప్రేమామృతాన్ని కురిపించే వాత్సల్య పూర్ణవు. లలిత పద సంభరిత చతురవు అయిన తల్లీ! నీకు ప్రణామములు.


విజయయాత్రా సంరంభోత్సవ సమయంలో అసంఖ్యాక ప్రజల గొంతుకలలో నినదించే జయ జయ ధ్వానానివి నీవు. కోట్లాది భుజాలపై ధరింపబడిన పదునైన ఖడ్గ సముదాయం కలిగిన దానవు. అధికాధిక బల సంపన్నురాలవైన,ప్రచండ శక్తి స్వరూపిణివయిన నిన్ను అబల అని పేర్కొనటంలో ఔచిత్యం లేదు తల్లీ! శత్రు మూకలను సంహరించగల, బలోపేతమైన వీరమాతవు నీవు. ప్రాణికోటి సకల దుఃఖాలను పోగొట్టి తరింప చేయగల దానవు నీవే తల్లీ!

నీవు సమస్త జ్ఞానానివి. ధర్మానివి.సకల జీవకోటిలో చేతనా కేంద్రమైన హృదయ స్థానానివి. సకల జ్ఞాన సంపన్నురాలవు నీవు. సమస్త జీవుల ప్రాణానివి నీవు. మమ్ములను దివ్య బల సంపన్నులుగా పెంచి పోషించే వీరమాత నీవు. అరివీర భయంకరమైన మా భుజాంతర్నిహితమై ఉన్న శక్తివి నీవే తల్లీ! అమ్మా!! మా అందరి హృదయాలలో జనించే భక్తి రూపానివి నీవే. ప్రతి మందిరములోనూ నీ దివ్య మంగళ విగ్రహాన్ని ప్రతిష్ఠించుకుంటాం.

దశవిధ ఆయుధ ధారిని అయిన దుర్గవు నీవు.సకల సంపత్ ప్రదాయిని అయిన లక్ష్మీదేవివి నీవు. పరాపర విద్యా ప్రదాయిని అయిన సరస్వతీ మూర్తివి నీవు. తల్లీ! నీకు అభివాదములు.అనంత ఐశ్వర్య ప్రదాతవు.అనన్య సామాన్యురాలివి. పుణ్య జల పూర్ణవు,అన్నపూర్ణవు అయిన మాతృమూర్తీ! నీకు వందనములు.

సస్యశ్యామలవు, సరళ వర్తనివి, మందస్మిత వదనారవిందవు,సకలాభరణ భూషితవు అయిన మాతృమూర్తీ! విశ్వజననీ! నీకు శతకోటి వందనాలు. శత సహస్ర ప్రణామములు.

# సంపూర్ణ జాతీయ గీతం



1.జన గణ మన అధినాయక జయహే భారత
భాగ్య విధాతా!
పంజాబ, సింధు,గుజరాత, మరాఠా,ద్రావిడ,
ఉత్కళ, వంగా
వింధ్య హిమాచల యమునా గంగా, ఉచ్ఛల
జలధి తరంగా తవశుభ నామే జాగే,తవ శుభ
ఆశిష మాగే,
గాహే తవ జయగాథా!
జన గణ మంగళదాయక జయహే భారత భాగ్య
విధాతా!
జయహే, జయహే, జయహే, జయ జయ జయ
జయహే!!

2.అహరహ తవ ఆహ్వాన ప్రచారిత శుని తవ
ఉదార వాణీ
హిందు, బౌద్ధ, సిఖ్,జైన,పారసిక, ముసల్మాన్
క్రిష్టానీ
పూరబ్ పశ్చిమ ఆసే,
తవ సింహాసన – పాశే
ప్రేమహార హయ గాథా!
జన గణ ఐక్య విధాయక జయహే, భారత భాగ్య
విధాతా!
జయహే, జయహే, జయహే, జయ జయ జయ
జయహే!

3.పతన అభ్యుదయ, బంధుర పంథా,
యుగ,యుగ ధావిత యాత్రీ
హై చిర సారథి తవ రథచక్రే ముఖరిత పథ
దినరాత్రి! దారుణ – విప్లవ మాఝే, తవ
శంఖధ్వని బాజే
సంకట దుఃఖం త్రాతా!
జన గణ పథ పరిచాయక జయహే, భారత
భాగ్య విధాతా!
జయహే, జయహే, జయహే, జయ జయ జయ
జయహే!

4.ఘోర తిమిర ఘన నిబిడ నిశీథే పీడిత
మూర్ఛిత దేశే జాగ్రత చిల తవ అవిచల
మతగల జతనయనే అనిమేషే!
దుఃస్వప్నే ఆతంకే రక్షా కరిల అంకే
స్నేహమయీ తుమి మాతా! జన గణ దుఃఖ
త్రాయక జయహే, భారత భాగ్య విధాతా!
జయహే, జయహే, జయహే, జయ జయ జయ
జయహే!



5.రాత్రి ప్రభాతిల, ఉదిల రవి ఛవి పూర్ణ
ఉదయగిరి భాలే, గాహే విహంగమ, పుణ్య
సమీరణ నవజీవన రస ఢాలే!తవ కరుణారాగే
నిద్రిత భారత జాగే
తవ చరణే నత మాథా
జయ జయ జయహే,జయ రాజేశ్వర భారత
భాగ్య విధాతా!
జయహే, జయహే, జయహే, జయ జయ
జయ జయహే!

**భావం:**
1.సమస్త జన సమూహముల మనస్సులను శాసించువాడవును, భారతదేశపు భవితవ్యమును నిర్ణయించువాడవునగు ఓ పరమేశ్వరా! పంజాబు మొదలుగాగల (పంజాబ్, సింధు, గుజరాత్, మహారాష్ట్ర, ద్రావిడ, ఉత్కళాది) ప్రాంతములు,వింధ్య హిమాలయాది పర్వతములు గంగా యమునాది నదులు పైకెగయు సాగరతరంగాలుగా నీ పవిత్రనామంతోనే మేల్కొనుచు నీ పవిత్ర ఆశీస్సులను కోరుచున్నవి. (ఆయా ప్రాంతాల ప్రజల హృదయాలు నీ నామస్మరణతో జాగృతమగుచున్నవి.ఆయా పర్వతాలలో నీ నామం ప్రతిధ్వనిస్తుంది. ఆయా నదీ ప్రవాహ సంగీతంలో నీ నామం గానం చేయబడుచున్నది. సముద్ర తరంగాలు నీ నామమే ఉచ్చరిస్తున్నాయి)నీ విజయ గాథలనే గానం చేస్తున్నాయి. జనసమూహములకు శుభములను గూర్చునో భారత భాగ్య నిర్ణేతా! నీకు జయమగుగాక!
2. హిందువులు, బౌద్ధులు, సిక్కులు, జైనులు, పారశీకులు, ముస్లిములు, క్రైస్తవులు... మొదలగు వివిధ మతస్థులైన ప్రజలను ఆహ్వానించుచు అహోరాత్రులు నీ స్వరము సకల ప్రాంతముల వ్యాపించుచున్నది. ప్రాక్పశ్చిమముల నుండి ప్రేమమాలగా కూర్చబడుటకై నీ పాద పీఠిచెంత పూజా కుసుమములర్పించబడుచున్నవి. సకల జన సమైక్యతా నిర్దేశకుడవు, భారత భాగ్య నిర్ణేతవగు ఓ పరమేశ్వరా! నీకు జయమగుగాక!
3. జాతుల ఉత్థాన పతనములతో రాటుదేలిన మార్గమున మానవేతిహాస రథమును నడిపించు ఓ నిరంతర సారథీ! ఆందోళనలు ఉత్పాతముల నడుమ నిరాశతో క్రుంగువారికి నీ శంఖధ్వని ధైర్యమునిచ్చి కష్టాలలో జీవితయాత్రలో మార్గదర్శనం చేయుచున్నది. సంకటముల నుండి రక్షించు ఓ పరమేశ్వరా! నీకు జయమగు గాక!
4. ఘోర నిశీథ నిబిడాంధకారమున క్రుగ్గి మూర్ఛితురాలైన దేశమాత ముఖమును నీ అనిమేష జాగృత నయనాలతో వీక్షించి స్నేహపూర్ణ మాతృహస్తమునందించి నిరాశావహ దుస్స్వప్న తమస్సులనుండి రక్షించు ఓ పరమేశ్వరా!భారత భాగ్య నిర్ణేతా!నీకు జయమగు గాక!
5.రాత్రి తొలగి ఉదయగిరిపై సూర్యుడుదయించుటతో పక్షుల గానము, ప్రభాత వాయువులు జీవితమున నవజీవనరసమునుగొని వచ్చుచున్నవి.నీ ప్రేమామృత కరస్పర్శతో భారతజాతి జాగృతమై నీ పాదముల ప్రోల శిరస్సు వంచుచున్నది. రాజాధిరాజువును భారత భాగ్య నిర్ణేతవునగు ఓ పరమేశ్వరా! నీకు జయమగు గాక!

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in